# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 6 మార్చి 2025 | HYDERABAD




## బస్ షెల్టర్‌నూ కిరాయికిచ్చారు

ఎర్రగడ్డ, మార్చి 5: అనుకున్నంత పని జరిగింది. ఆర్టీసీ ప్రయాణికులకు సేద తీర్చాల్సిన బోరబండ బస్ టెర్మినల్ లోని బస్‌షెల్టర్ రాత్రికి రాత్రి హోటల్‌గా మారింది. డివిజన్‌కు చెందిన కొందరు ఘనులు రెండు రోజుల కిందట తమ ఆధీనంలోకి తీసుకున్నారు. షెల్టర్‌కు షెట్టర్‌ను అమర్చి మంగళవారం రాత్రి ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. రూ.5 లక్షలు అడ్వాన్స్.. నెలకు రూ.25 వేలు కిరాయిగా ఒప్పందం కుదిరింది. షెల్టర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి అందులో హోటల్ వ్యాపారం మొదలు పెట్టాడు. కండ్ల ముందు ఇంత జరిగినా.. అటు ఆర్టీసీగానీ.. ఇటు బల్దియా వాళ్లు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది.




బంజారాహిల్స్ రోడ్‌నం. 1లోని తాజ్ బంజారా చెరువులో వ్యర్థాలతో పూడ్చిన దృశ్యం






ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో మొదలైన తాగునీటి కష్టాలు

# అడుగంటుతున్న జలం.. కష్టాల్లో జనం

- ఎండల తీవ్రతతో భారీగా పెరుగుతున్న నీటి వినియోగం
- ఆ ప్రభావంతో గణనీయంగా పడిపోతున్న భూగర్భ జల మట్టాలు
- మేడ్చల్ జిల్లాలో నెల రోజుల్లోనే 2.11 మీటర్ల లోతుకు..
- ట్యాంకర్లు బుకింగ్ పెరగడంతో జలమండలి సరఫరాలో ఇబ్బందులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 5 (నమస్తే తెలంగాణ): నగరంలో నీటి కష్టాల సంకేతాలు కనిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా హైదరాబాద్ మహా నగర పరిధిలోకి వచ్చే హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో భూగర్భ నీటిమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ప్రధాన నగరంలో మీటరుకు మించి నీటిమట్టం తగ్గిపోగా... మేడ్చల్ జిల్లాలోనైతే 2.11 మీటర్ల లోతుకు జలాలు పోయాయి. జలమండలి నీటి ట్యాంకర్లపై భారం రెట్టింపునకు మించి పెరగడంతో గృహాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల లోప్రెషర్ ..మరికొన్ని చోట్ల మునుపటికంటే తక్కువ నీళ్లు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్చి మొదటి వారం ముగియకముందే నగరంలోని అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు వేగంగా పడిపోయి బోర్లు మొరాయించడం కనిపిస్తున్నది. తాజాగా భూగర్భజల వనరుల శాఖ విడుదల చేసిన నివేదికలోనూ గత నెల రోజుల్లో భూగర్భజలాలు వేగంగా లోతుకు వెళుతున్నట్లుగా వెల్లడైంది. మేడ్చల్‌లో పది మీటర్ల కంటే ఎక్కువ లోతులో భూగర్భజలాలు ఉండగా... రోజులు గడిచేకొద్దీ అంతకంతకూ లోపలికి పోతున్నాయి. ఇదే క్రమంలో ప్రైవేటు నీటి వ్యాపారులు కూడా యధేచ్ఛగా భూగర్భ జలాలను తోడేయటంతో హైదరాబాద్ జిల్లా పరిధిలో గత రెండు నెలల్లోనే మీటరున్నర లోతుకు భూగర్భ జలాలు పోయాయి. మేడ్చల్ జిల్లాలోనైతే భూ ఉపరితలానికి 13.32 మీటర్ల లోతులో మాత్రమే జలాలు అందుబాటులో ఉండటమనేది ఆందోళన కలిగించే విషయం. రంగారెడ్డి జిల్లాలోనూ గత రెండు నెలల్లో 2.14 మీటర్ల మేర జలాలు కిందకు పడిపోయాయి. మరోవైపు జలమండలి ట్యాంకర్లకు డిమాండు భారీగా పెరుగుతున్నది. అందుకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో జనం ప్రైవేటు ట్యాంకర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు నీటి వ్యాపారులు శివారు ప్రాంతాల్లోని భూగర్భ జలాలను యధేచ్ఛగా లాగేయడంతో క్రమంగా అక్కడ కూడా నీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి.




మూడు జిల్లాల పరిధిలో భూగర్భ జల నీటిమట్టం తీరు ఇలా ఉంది... (మీటర్ల లోతులో)

| | | | | తగ్గుదల | |
|---|---|---|---|---|---|
| జిల్లా | డిసెంబరు-24 | జనవరి-25 | ఫిబ్రవరి-25 | నెల రోజుల్లో | రెండు నెలల్లో |
| హైదరాబాద్ | 6.96 | 7.29 | 8.40 | 1.11 | 1.44 |
| మేడ్చల్ | 10.35 | 11.21 | 13.32 | 2.11 | 2.97 |
| రంగారెడ్డి | 9.08 | 10.13 | 11.22 | 1.09 | 2.14 |



పంజాగుట్ట పోచమ్మబస్తీలో.. క్యూ



### లో ప్రెషర్‌తో ఇబ్బందులు..

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్, వివేకానందనగర్, తులసి నగర్, అల్లాపూర్, జనప్రియ నగర్ ప్రాంతాలకు బోరబండ సెక్షన్ నుంచి తాగునీరు సరఫరా అవుతున్నది. గత రెండు మూడు నెలలుగా పలు కాలనీలో లో ప్రెజర్ తో నీళ్లు సరఫరా అవుతుండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

### ప్రైవేటు ట్యాంకర్ల హవా..

కుత్బుల్లాపూర్ జోన్: కుత్బుల్లాపూర్ ఐడీపీఎల్ పరిధిలో నాలుగు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. కేవలం అరగంట పాటు లో ప్రెషర్ తో నీటి సరఫరా జరుగుతున్నదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ విలేజ్, జీడిమెట్ల విలేజ్, పేట్ బషీరాబాద్, అంగడిపేట విలేజ్, గోదావరి హోమ్స్, గాయత్రినగర్ వంటి జన సమూహ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని అక్కడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి కొరతను తీర్చేందుకు అధికార యంత్రాంగం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా డిమాండ్ సరఫరాలో అంతరం ఎక్కువగా ఉంటున్నది. కేవలం కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ పరిధిలో రోజుకు 300 బుకింగ్ అవుతున్నాయి. మరోవైపు నీటి కొరత తీవ్రంగా ఉండటంతో ప్రైవేటు ట్యాంకర్ నిర్వాహకులు ఇదే అదునుగా అమాంతం రేట్లను పెంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 5000 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్ రూ.800 ఉండగా, ప్రస్తుతం రూ. 1000 నుంచి 1500 వరకు ప్రజల అవసరాలు మేరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి.



**వారానికి రెండు సార్లే..**

నెల రోజులు నుంచి వారానికి రెండు సార్లు నీళ్లు వస్తున్నాయి. అది కూడాలో ప్రెషర్‌తో వస్తున్నది. గంటన్నర రావాల్సిని నీటి సరఫరా 40 నిమిషాలే వస్తున్నాయి. ఇతర అవసరాలకు బోర్ నీళ్లు కూడా రావడం లేదు.

- జయ శ్రీ. భగత్ సింగ్ నగర్

### సింగరేణికాలనీలో నీటి కష్టాలు

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. జలమండలి అధికారులు సరఫరా చేసే ట్యాంకర్ల పై ఆధారపడుతున్నారు. న్యాయస్థానంలో గుడిసెల స్థల వివాదంలో కొనసాగుతుందటంతో ప్రభుత్వం ఇప్పటివరకు వ్యక్తిగత నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో గుడిసెవాసులు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతిరోజు సుమారు 100కు పైగా ఫ్రీ ట్యాంకర్లను అధికారులు పేదలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇంటి ముందు పెట్టిన డ్రమ్ములలో పోసిన నీళ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పోతున్నారు.

## నగరం నడిబొడ్డున చెరువును పూడ్చేసి..

### తాజ్ బంజారా చెరువులో మట్టి డంపింగ్

### రెండు టిప్పర్ల స్వాధీనం

బంజారాహిల్స్: చెరువులు, కుంటల పరిరక్షణే లక్ష్యం అంటూ పేదలు నివాసం ఉంటున్న బస్తీలు, కాలనీల్లో హల్ చల్ చేస్తున్న హైడ్రా అధికారులు నగరం నడిబొడ్డున చెరువును అడ్డగోలుగా పూడ్చేస్తుంటే చోద్యం చూస్తున్నారా.. అంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని తాజ్ బంజారా చెరువును గతంలో హమీద్‌కుంట అని పిల్చేవారు. గుండ్ల చెరువుగా రెవెన్యూ రికార్డుల్లో ఉండే ఈ చెరువు చుట్టూ ఆక్రమణలు రాకుండా చూడడంతో పాటు వాకర్ల కోసం గత ప్రభుత్వ హయాంలో 900 మీటర్ల మేర వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టారు. కాగా ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని శివాలయం పక్కన జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పార్కుగా ఏర్పాటు చేశారు. అయితే కొంత మంది ప్రైవేటు వ్యక్తులు చెరువులోని స్థలంలోకి చొచ్చుకుని వెళ్లి నిర్మాణ వ్యర్థాలు నింపి సుమారు 500 గజాల మేర చెరువును పూడ్చివేశారు. పదుల సంఖ్యంలో ట్రిప్పర్లతో భవన నిర్మాణ వ్యర్థాలు తీసుకువచ్చి చెరువులో పోయడంతో అసలే కబ్జాలతో నిండిపోయిన తాజ్ బంజారా చెరువు.. మరింత కుంచించుకుపోయింది. జీహెచ్‌ఎంసీ పేరుతో సాగుతున్న చెరువు పూడ్చివేత వెనక స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తుల హస్తం ఉందని, తమ గేదెలను, ఆవులను పూడ్చివేసిన స్థలంలో ఉంచేందుకే ఈ పనిచేశారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు చెరువు ప్రారంభంలో సైతం అంబేద్కర్‌నగర్ బస్తీవైపు నాలాను ఆనుకొని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు చెరువులో మట్టి డంపింగ్ చేస్తున్నారు. గతంలో లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌తో పాటు మరికొన్ని నిర్మాణాల్లో కొంత భాగంగా తాజ్ బంజారా చెరువు బఫర్ జోన్‌లో ఉందని రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. అయితే ఇటీవల వారు సైతం చెరువులో వ్యర్థాలను పారవేస్తూ కాలుష్యానికి కారణంగా మారుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగి చెరువులో వ్యర్థాలను తొలగించాలని, చెరువును పూడ్చిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. తాజ్ బంజారా చెరువులోకి ఇష్టారాజ్యంగా డ్రైనేజీ నీరు వదులుతుండడంతో చెరువు మొత్తం కాలుష్య కాసారంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో మురుగునీటితో పాటు తీవ్రమైన దుర్వాసనలు వెదజల్లుతున్న తాజ్ బంజారా చెరువును శుభ్రం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, కొందరు లారీలు ద్వారా తాజ్ బంజారా చెరువులోకి ప్రవేశించి మట్టిని డంపింగ్ చేస్తున్నారని మంగళవారం రాత్రి సమాచారం అందుకున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బంజారాహిల్స్ పోలీసులు, జోనల్ కమిషనర్‌కి సమాచారం అందించారు. బంజారాహిల్స్ పోలీసులు దంపింగ్ చేస్తున్న రెండు ట్రిప్పర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.



చెరువును పూడ్చేందుకు తీసుకొచ్చిన టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## ఆడపడుచే ప్రాణం తీసింది

### వీడిన శిరీష హత్య కేసు మిస్టరీ



మలక్‌పేట: అనుమానాస్పద స్థితిలో మరణించిన శిరీషను ఆడపడుచే హత్య చేసిందని పోలీసులు నిర్ధారించారు. బుధవారం చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు, డీఐ భూపాల్‌గౌడ్, ఎస్ఐ రవిరాజ్‌లతో కలిసి సౌత్ ఈస్ట్‌జోన్ మలక్‌పేట డివిజన్ ఏసీపీ శ్యాంసుందర్ ఈ ఘటన వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా పరకాలకు చెందిన శిరీష (32) కు చిన్నతనం(ఐదేండ్ల వయస్సు)లోనే తల్లిదండ్రులు చనిపోవటంతో ఆమెను ఒక ప్రొఫెసర్ దత్తత తీసుకొని పెంచి పెద్దచేశారు. ఆ తర్వాత శిరీష వారి వద్ద నుంచి వెళ్లొచ్చి బయటనే ఉంటూ బీఎస్సీ నర్సింగ్ చేసింది. పదేళ్లుగా వివిధ ఆస్పత్రులలో నర్సుగా విధులు నిర్వర్తించింది. నాగర్‌కర్నూల్ జిల్లా సున్నిపెంట చెందిన వినయ్ ఓ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా అతని సోదరి సరిత 2016లో ఒకే ఆస్పత్రిలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో సదరు ఆస్పత్రిలో నర్సుగా చేరిన శిరీషకు సరితతో సాన్నిహిత్యం పెరిగింది. సరిత తన తమ్ముడికి నచ్చజెప్పి శిరీషను ఒప్పించి 2016లో(తొమ్మిదేండ్ల క్రితం) అన్నీ తానై ఇద్దరికి పెళ్లి జరిపించింది. ప్రస్తుతం వీరికి రెండేండ్ల కూతురు కూడా ఉంది. పెళ్లైన నాటినుంచి వినయ్, శిరీష దంపతులు మలక్‌పేటలోని జమునా టవర్స్‌లో నివాసం ఉంటున్నారు. సరిత భర్త విదేశాల్లో ఉండడంతో ఆమె కూడా వీరిద్దరితోనే అదే ఇంట్లో నివాసం ఉంటున్నది. అయితే ఇటీవల నర్సుగా పని మానేసి ఇంటి వద్ద ఉంటున్న శిరీషను సరిత మందలించింది. పదే పదే ఉద్యోగం వదులుకోవడం తగదంటూ ఘర్షణ పడింది. ఇటీవల సరిత, శిరీషల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2 శనివారం అర్ధరాత్రి 11.30 గంటలకు సరిత-శిరీషలు గొడవ పడి కొట్టుకున్నారు. శిరీషను సరిత తీవ్రంగా గాయపరిచింది. కాస్త సద్దుమణిగాక తనకు అస్వస్థతగా ఉందని చెప్పిన శిరీషకు... సరిత తాను వాడుకునే మత్తుమందును అధిక మోతాదులో శిరీషకు ఇచ్చింది. దీంతో శిరీష మత్తులోకి జారుకుంది. ఇదే అదునుగా శిరీషకు ఊపిరి ఆడకుండా సరిత దిండు అదిమి ప్రాణం పోయేలా చేసింది. ఈ విషయాన్ని మరుసటి రోజు ఉదయం తమ్ముడు వినయ్‌కు చెప్పింది. ఇదంతా తెలుసుకున్న వినయ్ అక్కను కాపాడే ప్రయత్నంలో శిరీషకు గుండెపోటు వచ్చిందంటూ చెప్పి ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి అది సహజ మరణమేనని నమ్మించాడు. అక్కడి నుంచి అంబులెన్స్ మాట్లాడి శిరీష మృతదేహాన్ని సున్నిపెంటకు తరలించే ప్రయత్నం చేశాడు. ఇంత హడావుడిగా అంబులెన్స్‌ను తీసుకెళ్లే ప్రయత్నంపై శిరీష మేనమామ మధుకర్‌కు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి అంబులెన్స్‌ను వెనక్కి పిలిపించి పోస్టుమార్టం చేయిస్తే అసలు బండారమంతా బయటపడింది. శిరీషకు ఊపిరాడకుండా చేసి చంపివేసి ఉంటారని పోస్టుమార్టం చేసిన వైద్యులు వెల్లడించడంతో వినయ్, సరితలను పోలీసులు విచారించారు. ఈ హత్యకు తానే పాల్పడినట్లు సరిత ఒప్పుకున్నదని పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసులో సరిత, వినయ్‌లతో పాటు భిట్టు అనే మరో నిందితుడిపై కూడా హత్యకు సంబంధించిన కసులు పెట్టారు. మరింత లోతైన విచారణ చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.

### 8న జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 5 (నమస్తే తెలంగాణ) :ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. రాజీ చేసుకునేందుకు వీలున్న సెక్షన్ల కింద నమోదైన కేసులన్నింటినీ తొలగించేందుకు కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు.

### నీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బీహెచ్‌ఈఎల్ జంక్షన్ దగ్గర ఫ్లై ఓవర్ నిర్మించనున్నది. అందులో భాగంగా బీహెచ్‌ఈఎల్ ఫ్లై వద్దనున్న 1500 ఎంఎం డయా పైపులైన్ కు జంక్షన్ పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా 12 గంటల పాటు కొన్ని చోట్ల నీటి సరఫరాలో అంతరాయం మరికొన్ని చోట్ల లో-ప్రెజర్ తో నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

### పిచ్చికుక్క దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర, మార్చి 5: పిచ్చికుక్క దాడిలో తల్లి కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని వన్నీగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వన్నీగూడ గ్రామానికి చెందిన పండుగ సత్తమ్మ (55), పండుగ నవీన్ (37) లపై పిచ్చి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు.

## ఓపీ ముగిశాక వచ్చి.. షోకాజ్ నోటీసులా?

### మంత్రి తీరుపై మండిపడుతున్న గాంధీ వైద్యసిబ్బంది

సిటీబ్యూరో: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తీరుపై గాంధీ వైద్యులు తీవ్రంగా మండిపడుతున్నారు. 'ఓపీ సమయం ముగిసిన తరువాత వచ్చి ఓపీలో ఎవరూ లేరని షోకాజ్ నోటీసులిస్తామంటే ఎలా...అని పలువురు వైద్యులు మంత్రి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.15గంటల సమయంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన మొదట ఓపీ విభాగాన్ని సందర్శించి, అక్కడి విభాగాలన్నీ కలియతిరిగారు. అయితే అప్పటికే ఓపీ సమయం ముగియడంతో అక్కడ రోగులు పెద్దగా లేరు. సిబ్బంది భోజనానికి వెళ్లిపోయారు. దీంతో ఓపీ విభాగంలో ఎవరూ లేకపోవడమేంటని మంత్రి వైద్యులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారికంగా ఒంటి గంట వరకు ఓపీ పూర్తి చేసుకుని, ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 2వరకు భోజన విరామం, ఆ తరువాత 2నుంచి మధ్యాహ్నం 4వరకు ప్రొఫెసర్ స్థాయి వైద్యాధికారులు అకాడమిక్‌కు అంటే వైద్యవిద్యార్థులకు బోధించేందుకు వెళ్తారు.



మంగళ వారం గాంధీలో తనిఖీ చేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

### చెప్పేది వినకుండా..

ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఎంసీహెచ్ భవనంలోని ఐదోఅంతస్తులో ఉన్న ఐవీఎఫ్ కేంద్రాన్ని మంత్రి సందర్శించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడున్న రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసిన మంత్రి ఐవీఎఫ్ ఇన్‌చార్జ్ గురించి కూడా ఆరాతీశారు. ఆ సమయంలో సదరు వైద్యులు అక్కడ లేకపోవడంతో మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సదరు వైద్యురాలు లేబర్ రూమ్ నుంచి మంత్రి ఉన్న ఐదో అంతస్తులోకి వచ్చేందుకు యత్నించగా అక్కడున్న లిఫ్ట్‌ను మంత్రి కోసం నిలిపివేశారు. దీంతో చేసేది లేక సదరు వైద్యురాలు మెట్ల మార్గంలో వచ్చినా అప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న మంత్రి సదరు వైద్యురాలు చెప్పేది వినకుండా, సీట్లో లేనందుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలంటూ అధికారులను ఆదేశించారు.


